క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

జూలూరుపాడు: మండలంలోని భేతాళపాడు శ్రీ సోమేశ్వర (శ్రీసోమన్న)స్వామి ఆలయం అభివృద్ధికి వరద్ సీడ్స్ అండ్ అగ్రిటెక్, జోషిక క్రాప్ కేర్ కంపెనీ, గుంటూరు వారు రూ.1,00,116లు విరాళం అందజేశారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి సర్పంచ్ గుగులోత్ రాందాస్‌కు ఈ విరాళాన్ని కంపెనీ ప్రతినిధులు అందజేశారు. అదేవిధంగా నాగేంద్రబాబు అనే భక్తుడు ఆలయ అభివృద్ధికి రూ 5,000లను సర్పంచ్‌కు అందజేశారు.

నేటి నుంచి ప్రతిష్ఠ పూజలు

జూలూరుపాడు: మండలంలోని కరివారిగూడెం కాలనీలో సోమవారం నుంచి దేవతా విగ్రహాల ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు శ్రీ మోక్ష కోదండ రామాలయం భక్త బృందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠమహోత్సవ పూజలు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. 24వ శుక్రవారం ఉదయం 10.18 గంటలకు శ్రీ కోదండరామ స్వామి, శ్రీ ఆంజనేయస్వామి, నాభిశిల, శ్రీముత్యాలమ్మతల్లి, శ్రీమారేడమ్మ, ధ్వజస్తంభాలను ప్రతిష్ఠించనున్నట్లు భక్త బృందం తెలిపింది. ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

విద్యార్థులకు మోటివేషన్ తరగతులు



మోటివేషన్ కార్యక్రమంలో యాజమాన్యం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి విద్యాసంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి డబుల్ గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు మోటివేటర్ వంగీపురం శ్రీనాథా చారి ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. అంతేకాకుండా 2021-22 సంవత్సరంలో టెన్ బై టెన్ గ్రేడ్ సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి వీరేంద్రచౌదరి, గొల్లపూడి జగదీష్, కె.కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ వై వి సురేష్, శ్రీనివాస్‌సింగ్, మాచవరపు కోటేశ్వరరావు, సీఆరోఓ మురళికృష్ణ, రమేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

గనులపై టూల్‌బాక్స్‌లు ఏర్పాటు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు గనుల మీద టూల్స్ ఏర్పాటు చేయాలని, కార్మికులకు నాణ్యమైన రక్షణ పరికరాలు ఇవ్వాలని సీఐటీయూ కొత్తగూడెం ఏరియా బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బట్టల కుట్టుకూలీ చార్జీలు మార్కెట్ రేటుకు అనుగుణంగా ఇవ్వాలని, కార్మికుల హెల్మెట్లను ఎక్కడ భద్రపరుచుకోవాలో అర్థం కావటంలేదని కార్మికులు తమ యూనియన్ దృష్టికి తీసుకొచ్చారని, ఈ విషయమై యాజమాన్యం దాటేస్తుందని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం వారికి తగిన సదుపాయాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్మికుల రక్షణకు కోట్ల రుపాయలను ఖర్చుచేస్తున్న యాజమాన్యం టూల్ బాక్స్‌లు ఎందుకు ఏర్పాటు చేయటంలో జాప్యం తగదని పేర్కొన్నారు.

చంద్రప్రకాష్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న పోట్ల, నాయకులు

కొత్తగూడెంరూరల్ : లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ లగడపాటి రమేష్ తండ్రి చంద్రప్రకాష్ దశదిన కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు వేర్వేరుగా హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, కొట్టి వెంకటేశ్వరరావు, గోపాల్‌రావు రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జేబీ శౌరీ, ఏనుగుల అర్జున్‌రావు, సీనియర్ న్యాయవాది వెల్లంకి వెంకటేశ్వరావు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గద్దం రాజశేఖర్, నాయకులు అజ్మీర సురేష్ నాయక్ సాయి తదితరులు పాల్గొన్నారు.

పాఠం.. దృశ్యరూపం!

పుస్తకాల్లో క్యూఆర్ కోడ్

- స్కాన్ చేస్తే సెకన్లలో సందేహాల నివృత్తి
- విద్యార్థులకు సులభతరంగా మారిన నూతన విధానం



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు



క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన పాఠం

సుజాతనగర్: ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తోంది. దీంతోపాటు నాణ్యమైన విద్య కోసం నూతన విద్యా విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేందుకు పాఠ్యపుస్తకాల్లో వీడియో రూపంలో 'క్యూ ఆర్ కోడ్' అందుబాటులోకి తీసుకొచ్చింది. కొంతమంది విద్యార్థులు విని నేర్చుకుంటే, కొందరు చూసి నేర్చుకుంటారు. దృశ్యరూపం ఖచ్చితంగా విద్యార్థులకు ఎప్పటికీ జ్ఞాపకం ఉంటుంది. ఉపాధ్యాయుడు పాఠం చెప్పేటప్పుడు వచ్చే సందేహాలను నివృత్తి చేసుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన క్యూ ఆర్ కోడ్ విధానం విద్యార్థులకు ఒక వరం అని చెప్పొచ్చు. ఎందుకంటే కోడ్‌ను స్కాన్ చేస్తే పాఠానికి సంబంధించి అన్ని సందేహాలు నివత్తి అవడంతో పాటు అదనపు సమాచారం కూడా విద్యార్థులకు అందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా పాఠ్యపుస్తకాల్లో క్యూఆర్ కోడ్ పొందుపరిచారు.

క్యూఆర్ కోడ్‌తో పుస్తకాలు..

గతంలో పాఠ్యపుస్తకంలో మొదటి, చివరి పేజీల్లో మాత్రమే క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉండేది. కానీ ప్రస్తుతం కొత్తగా ప్రతీ పాఠ్యాంశంపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించింది. 1 నుంచి 10వ తరగతి వరకూ పాఠ్యపుస్తకాల్లో ప్రస్తుతం క్యూ ఆర్ కోడ్ దర్శనమిస్తోంది. ఈ కోడ్‌ను విద్యార్థులు స్మార్ట్ ఫోన్లో స్కాన్ చేసి పాఠ్యాంశాలను చూస్తూ, వింటూ అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ఇప్పటికే ఈ పాఠ్య పుస్తకాలను విద్యాశాఖ అధికారులు పంపిణీ చేశారు.

స్కాన్ చేస్తే పాఠం ప్రత్యక్షం..

విద్యార్థులు ఏ కారణంతోనైనా పాఠశాలకు హాజరు కాక ఏ పాఠ్యాంశాన్ని అయినా కోల్పోయినా క్యూ ఆర్ కోడ్ సదుపాయం ఉంది కాబట్టి సందేహించాల్సిన అవసరం ఉండదు. పాఠ్యాంశం ఎప్పుడు కావాలంటే అప్పుడు క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వీడియో రూపంలో చూడొచ్చు. పాఠ్యాంశాన్ని స్కాన్ చేసి డౌన్ లోడ్ చేసుకొనే వెసులుబాటు సైతం ఉంది. దీని వల్ల ఒక్కసారి స్కాన్ చేసి డౌన్లోడ్ చేసుకుంటే ఆ పాఠ్యాంశం వారి ఫోన్ గ్యాలరీలో సేవ్ అవుతుంది. దానిని విద్యార్థులు ఆఫ్‌లైన్లో చూసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నూతన విధానంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఉపయోగం..



హైస్కూల్ పాఠ్యాంశంలో వచ్చిన సందేహన్ని నివృత్తి చేసుకునేందుకు క్యూ ఆర్ కోడ్ విధానం ఆసరాగా ఉంటుంది. ఒక అంశానికి సంబంధించిన పూర్తి వివరణ వీడియో రూపంలో ఉండడంతో పదే పదే చూడాలనిపిస్తోంది.

– కె.స్వప్నలహరి,10వ తరగతి, సుజాతనగర్

పూర్తి స్థాయిలో పాఠం అర్థమవుతోంది



పాఠ్య పుస్తకాల్లో ప్రవేశపెట్టిన క్యూ ఆర్ కోడ్‌తో చాలా ఉపయోగం ఉంది. ఈ విధానం వలన పూర్తిస్థాయిలో పాఠ్యాంశాలపై అవగాహన కలుగుతుంది. పాఠాలు చాలా బాగా అర్థమవుతున్నాయి.

– బి.సుభద్ర, సుజాతనగర్ హైస్కూల్

అవగాహన కల్పిస్తున్నాం



క్యూ ఆర్ కోడ్ విధానంలో పాఠ్యాంశాలపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. పాఠ్యాంశాలు వీడియోల రూపంలో ఉండడం వల్ల త్వరగా అర్థమవుతాయి. అలాగే మెదడులో నిక్షిప్తమైన వీడియోలు పునశ్చరణ సమయంలో గుర్తుకు వచ్చి విద్యార్థుల ఉత్తీర్ణతకు దోహదపడతాయి.

– ఎం.శ్రీనివాస్, హెచ్ఎం, సుజాతనగర్, హైస్కూల్

వైభవంగా శివకల్యాణం



జూలూరుపాడు: పాపకొల్లు ఉమాసోమలింగేశ్వర ఆలయంలో కల్యాణానికి హాజరవుతున్న ఎమ్మెల్యే రాములు నాయక్



టేకులపల్లి: కొప్పురాయి స్వర్ణలింగేశ్వర మల్లన్న స్వామి ఆలయంలో జెడ్పీ చైర్మన్ దంపతులు..

మహా శివరాత్రిని పురస్కరించుకొని ఆలయాల్లో శివ కల్యాణాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

అన్నదానాలు...

పాల్వంచ: మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం పాత పాల్వంచ శ్రీ ఆత్మలింగేశ్వరాలయం, దమ్మపేట క్రాస్ రోడ్డులోని శ్రీ గంగా పార్వతీ సమేత సోమలింగేశ్వర స్వామి ఆలయం, గట్టాయిగూడెంలోని సాంబసదా శివాలయం, వనమా కాలనీలోని శివాలయాల్లో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు జరిపారు. ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు, రంగాకిరణ్, రాము, సద్గురు ఫౌండేషన్ అధ్యక్షుడు వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: మండలకేంద్రంలోని స్థానిక శివాలయంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు చేశారు.

ఇల్లెందురూరల్: మండలంలోని రేపల్లెవాడ శివాలయంలో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ బింగి కృష్ణ, ఉపసర్పంచ్ పోటు రవి, స్థానికులు అనిల్‌రెడ్డి, శారద, దేవా పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు రక్షించాలి



సన్మానం చేస్తున్న క్లబ్ సభ్యులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రక్తదానం చేసి ప్రాణాలను రక్షిచాలని యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బిక్కులాల్, ప్రధానకార్యదర్శి గుండపనేని సతీష్ అన్నారు. ఏడేళ్లుగా దేశవ్యాపితంగా 15 వేల మందికి ఇప్పటి వరకు రక్తాన్ని అత్యవసరంగా అందించినట్లు వారు తెలిపారు. స్థానిక టీవీపీఎస్ కార్యాలయంలో ఆదివారం క్లబ్ అధ్యక్ష కార్యదర్శులైన బిక్కులాల్, సతీష్‌లను ఆర్‌వీఎం బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు కన్నా, మిత్రులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, నరేష్, ముజాఫర్, రవి, బిల్లా, హేమంత్, రాజు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి

ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. శివాజీ సేవల్ని, వీరత్వాన్ని కొనియాడారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: బీఎస్పీ ఆధ్వర్యంలో..



చుంచుపల్లి: రుద్రంపూర్‌లో..



టేకులపల్లి: మండలకేంద్రంలో..

ఆర్డీఓపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: ఏజెన్సీ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా భూ బదలాయింపు చేసిన కొత్తగూడెం ఆర్డీఓపై విచారణ జరిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చుంచుపల్లి మండలంలో భూమిని గిరిజనేతరులకు భూ బదలాయింపు చేయగా వారు ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా, పంచాయతీరాజ్ చట్టాలకు వ్యతిరేకంగా వెంచర్లు వేసి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఆర్డీఓగా స్వర్ణలత డ్యూటీలో చేరిన నాటి నుండి చేసిన భూ బదలాయింపులపై కమిటీ వేసి విచారణ జరిపించాలన్నారు. సాయి, నిరంజన్ కుమార్, రవికుమార్, వంగా రవిశంకర్, ఆకుతోట పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ రాజీవ్‌నగర్‌తండా శివారులో గుడిసె వాసులు నివసిస్తున్న ప్రాంతానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సింగరేణి ఏరియా ఎస్వోటు జీఎం మల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి నబి, కృష్ణ, ఆలేటి కిరణ్, రాందాస్, పాష, హుస్సేన్, వీరభద్రం, వెంకన్న, ఖాదర్, ఖాజా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న వారందరికీ పట్టాలివ్వాలి

టేకులపల్లి: తెలంగాణ రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం 2006, పీసా చట్టం ప్రకారం ఆదివాసీ, గిరిజనులందరికీ పోడుభూమి పట్టాలివ్వాలని, భూమి లేని గిరిజనులకు మూడెకరాల భూమిని ఇవ్వాలని ఏఐకెఎంఎస్ జిల్లా నేత భూక్య హర్యా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 20న పోడు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ బద్దుతండాలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2014 నుంచి కేసీఆర్ పోడు భూముల సమస్యను పరిష్కారం చేయకుండా ఎన్నికల ప్రచారానికి ఉపయోగించుకుని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అటవీ హక్కుల చట్టాలకు లోబడి, ఎలాంటి లిటిగేషన్ పెట్టకుండా పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి భూక్య నర్సింగ్, రామ, లింగ్య, ఈర్యా, జబ్బార్, లాల్‌కిషన్ పాల్గొన్నారు.

కులాల ప్రాతిపదికన చేయూత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

పాల్వంచ: కుమ్మరి కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక వర్తక సంఘం భవన్‌లో జిల్లా కుమ్మరి ఆత్మీయ సమ్మేళన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బి.శంకర్ రావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు వనమా మాట్లాడుతూ... కులాల ప్రాతిపదికన కళాకారులకు, సంఘాలకు చేయూత ఇవ్వడమే ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగిస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. సంఘం భవన నిర్మాణానికి కావాల్సిన స్థల కేటాయింపుపై సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. అనంతరం వనమాను సన్మానించారు. సంఘం నాయకులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నడికుడి జయంతి రావు, మల్కాజ్‌గిరి దయానంద్, మహిళా అధ్యక్షురాలు మల్లెల ఉషారాణి, రాజలింగం, రేణుక, ఉపేంద్ర, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, బాలకృష్ణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మెన్ బత్తుల వీరయ్య, సొసైటీ చైర్మన్ మండే వీరహన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే



పట్టణంలోని వార్డుల్లో పర్యటిస్తున్న హరిప్రియ

ఇల్లెందు: పట్టణంలోని 1, 2వ వార్డులలో ఎమ్మెల్యే హరిప్రియ ఆదివారం పర్యటించి అక్కడి ప్రజా సమస్యలను సేకరించారు. తొలుత సత్యనారాయణపురం, పాత ఇల్లెందులపాడులో పర్యటించి రెండు వార్డులలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు కాల్వలు, రోడ్లు, లైట్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చి పెద్దఎత్తున వినతి పత్రాలు అందజేశారు. తమ వార్డులలో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టారు. ఇటీవల ప్రకటించిన నిధులతో చేపట్టాల్సిన పనులను వార్డు కౌన్సిలర్‌లతో సమావేశం పెట్టి ఒక్కో వార్డుకు రూ. 50 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఆ పనులను గుర్తించి వివరాలు అందజేయటంతో కౌన్సిలర్‌లు చొరువ చూపటం లేదని ఎమ్మెల్యే స్వయంగా వార్డుల పర్యటన చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కౌన్సిలర్‌లు, బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గిట్టుబాటు ధర కల్పించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: చిరు వ్యాపారులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. నియోజకవర్గం పట్టణ పరిధిలోని హెడ్ ఆఫీస్ సంతలో హథ్ సే హథ్ అభియాన్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటు మోదీ ఇటు కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలు కష్టాలతో అల్లాడుతున్నారన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంపై సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. శాంతయ్య, కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి మల్లికార్జున్, మండలాధ్యక్షులు సకినాల వెంకటేశ్వరరావు, అంతోటి పాల్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వర్లు, పట్టణ మహిళ అధ్యక్షురాలు వాలి, సుబ్బారెడ్డి, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, అక్బర్, రఘు, సారంగపాణి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాల్వంచ: పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీ శ్రీనివాసగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం(గుట్ట)పై మార్చి 17 నుంచి 20 వరకు జరిగే శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని భక్తసమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ప్రధాన కార్యదర్శి ధర్మపురి రాము అన్నారు. ఆదివారం కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలకు ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేశ్ శర్మ, సహాయ అర్చకులు ఫణిరాజ చార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పత్రికలను ఆవిష్కరించారు. సమన్వకర్త ఊకె భద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కందుకూరి రాము, గోవింద రెడ్డి, జమ్ముల సీతారామి రెడ్డి, సంక్రాంతి రవి, కొదుమూరి సత్యనారాయణ, మేదరమెట్ల శ్రీనివాసరావు, రామకృష్ణ, శ్రీలత, లక్ష్మిరెడ్డి, బండి నారాయణ, వెంకటేశ్వరరావు, గద్దం వెంకట సుబ్బయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొమరారం మండలమయ్యే వరకు విశ్రమించం..



దీక్షలో కూర్చున్న నాయకులు, గ్రామస్తులు

ఇల్లెందురూరల్: కొమరారంను మండల కేంద్రంగా ప్రకటించే వరకు విశ్రమించబోమని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు యదళ్లపల్లి సావిత్రి స్పష్టం చేశారు. మండలంలోని కొమరారం గ్రామంలో కొమరారంను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్రజాపంథా ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 19వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు హాజరైన మహిళలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన చేపట్టాల్సిన ప్రభుత్వం తన సొంత ప్రయోజనాల మేరకు పనిచేస్తోందన్నారు. గిరిజనులు అత్యధికంగా నివాసం ఉండే ఈ ప్రాంతానికి న్యాయం చేయని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాళి కృష్ణవేణి, ఎంపీటీసీ అజ్మీర బిచ్చా, నాయకులు నాగలక్ష్మి, తనకంపద్మ, ఇర్ప సమ్మక్క, స్వర్ణ, కరుణ, కోరం రాణి, మల్లికాంబ, సౌందర్య, శెట్టి లక్ష్మి, అస్మిత, మాధవి పాల్గొన్నారు.

చెరువు పూడిక తీయించి ఆదుకోండి

టేకులపల్లి: టేకులపల్లి మండలం కిష్టారం గ్రామంలో ఉన్న చింత పెద్ద జోగయ్య కుంటను పూడిక తీయించి రైతులను ఆదుకోవాలని కుంట ఆయకట్టు రైతులు కోరారు. ఈ మేరకు ఆదివారం కోయగూడెం ఓపెన్ కాస్టు ప్రాజెక్టు ఆఫీసర్ ప్రహ్లాద్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చింత జోగయ్య, వెంకటేశ్వర్లు, సమ్మయ్య, సురేష్, నాగయ్య, సర్వేష్, ప్రభాకర్, రమేష్, రామకృష్ణ, మధు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

నోరు తెరిచిన కుళాయిలు

గరీభ్‌పేట గ్రామంలో మంచినీటి ఏర్పాటు కోసం అమర్చిన కుళాయిలు ప్రమాదభరితంగా మారాయి. నీటి సరఫరా అనంతరం వీటి పైన మూతలు వేయడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చిన్నారులు, జంతువులు, వాహనదారులు ఏమరుపాటుగా ఉంటే కుళాయిల్లో పడిపోయే ప్రమాదం ఉంది. సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

-సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : టి.వెంకటలక్ష్మీ, ఎంపీడీఓ
సెల్ నంబర్ : 6303023384

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148
భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎస్. లక్ష్మయ్య - 80742 70476
ఇల్లెందు బి. శేషు - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గాప్రసాద్ - 79979 58226
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమన శుభాకాంక్షలు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416